


# వేదాంతి

**రం**గారావు అంత రసహీనంగా, నీరసంగా బతుకును దొర్లించడం, అతడి స్నేహితులకు ఏమాత్రం సహించలేదు. చాలామంది చాలాసార్లు చెప్పి చూశారు – ప్రయత్నించి కూడా చూశారు. ససేమిరా అతడు గృహస్థాశ్రమం స్వీకరించడానికి మాత్రం అంగీకరించలేదు.

పైపై మాటల్నీ, స్నేహితులతోటి ప్రవర్తననీ, స్త్రీల దగ్గిర అతడి పట్టీ పట్టనట్టు తిరిగే ధోరణినీ, అతడి వేషంగా, నటనగా అవతల పెట్టి, అసలైన రంగారావును, ఆలి ముసుగు వెనకవున్న రంగారావును చూచేట్టయితే, అతడి తీరిక కాలాన్నీ, భావనాశక్తినీ, వూహల్నీ, కలల్నీ అన్నిటినీ స్త్రీ మీద కేంద్రీకరించి, స్త్రీలని గురించే ఆలోచిస్తూ, బాధపడుతూ వుంటూంటాడనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేకపోగా, బహుశా యిది అతడి మానసిక పరిస్థితిని తక్కువ అంచనా వేయడమే కావొచ్చు.

అతడి ఆశలూ, ఆదర్శాలూ, మూర్తీభవించిన స్త్రీ మూర్తి యీ లోకంలో - కనీసం యీ శతాబ్దంలో - దొరకడం అసంభవం అని అతడికి తెలిసివచ్చేప్పటికి వయసు యిరవై ఆరు నుంచి యిరవై ఏడులోకి దొర్లిపోయింది.

తన గత జీవితాన్నీ, నిస్సారంగా వెళ్ళబుచ్చిన రోజుల్నీ, అన్ని ఆశయాలూ, అందచందాలూ ఒకే స్త్రీమూర్తిలో ఘనీభవించి వుండాలన్న అత్యాశతో, తను చేజేతా జారవిడిచిన అవకాశాల్నీ - అన్నిటినీ అతడు ఆ రోజున, తన వయసు యిరవై ఏడు సంవత్సరాలని తెలిసిన రోజున సింహావలోకనం చేసుకున్నాడు.

తన ఆదర్శకాంతకు వుండవలసిన సౌందర్యం, అతడికి జానకిలో కనబడింది. కాని తెలివితేటలూ, హుందాతనం - అవన్నీ ఆమెలో లేవు. అవి కావాలంటే సరోజినీ, సత్యవతీ, లలితా...

రంగారావు ఆఫీసులో పనిచేసేప్పుడూ, ఆఫీసరుతో మాట్టాడేప్పుడూ, స్నేహితులతో కలిసి తిరిగేప్పుడూ - ఒక్కమాటలో మేల్కొనివున్న కాలాన్నంతా యిలాంటి ఆలోచనలతోనే గడిపాడు. నిద్రావస్థలో కూడా అవే కలలు అతణ్ని గుక్కతిప్పుకోకుండా ముంచెత్తేవి. కాని వాటిల్లో మాత్రం అతడికి తన ఆదర్శ స్త్రీ ప్రత్యక్షమయ్యేది. జానకి, సరోజిని, సత్యవతి, లలితా - అందరూ భిన్న వ్యక్తిత్వాల్నీ రూపాల్నీ కోల్పోయి, మరో పేరుతో మరో రూపంతో కనబడేవారు. తన ఆదర్శ స్త్రీ కనబడినట్టే, ఆశలూ ఆశయాలూ ఫలించినట్టే రంగారావు తన్మయతతో వుక్కిరి బిక్కిరై, వులిక్కిపడి లేచేవాడు. కలలోని మాధుర్యం పోయి, యదార్ధ ప్రపంచంలోని నగ్నసత్యం తిరిగి అతణ్ని ఆలోచనల్లోకీ, నిరాశలోకీ నెట్టేది.

తను యింతకాలం కలల్లో బతికాననీ, అసంభవాలకేసి అర్రులు చాచాననీ గ్రహించేప్పటికి - అతణ్ని మరో విషాదం, నిస్పృహా చుట్టుముట్టినై.

జానకి వివాహమైంది - యిద్దరు బిడ్డల తల్లి. సరోజిని సంవత్సరం నుంచి భర్తతో కాపురం చేస్తోంది. సత్యవతి ఎక్కడున్నదో అంతేలేదు. లలితకు పెళ్ళిసంబంధం నిశ్చయమైపోయింది.

వాళ్ళల్లో ఏ వొకర్నయినా తను ఏ మాత్రం ప్రయత్నించివున్నా, భార్యగా పొందగలిగేవాణ్నన్న సత్యం రంగారావును నిలువునా కుంగదీసింది. అనేక దినాలు, పగలూ - రాత్రనక అతడు పోగొట్టుకున్న యీ అవకాశాల్ని గురించి ఎంతో బాధపడ్డాడు. తనను తానుగా మందలించుకున్నాడు - తనకు తానై తిట్టుకున్నాడు - దూషించుకున్నాడు.

పుట్టి పెరిగిన వూళ్ళో వుద్యోగం చేయడం, ఆ పరిసరాల్లో, తను కోరి తెచ్చుకున్న నిరాశల మధ్య బతకడం రంగారావుకు భరించరానిదిగా తోచింది. తపస్సు చేసుకునేందుకు హిమాలయ ప్రాంతాలకు వెళ్ళిపోవాలనీ, జీవితకాలమంతా బ్రహ్మచారిగా గడపాలనీ, అతడికి మధ్య మధ్య ఆలోచనలు కలిగినా - ఏదో యింగిత జ్ఞానం, అంతా నశించిపోలేదనీ, ఆశకీ, ఆనందానికీ యింకా స్థానం వున్నదనీ హెచ్చరించి మేల్కొల్పినట్టు తోచేది. ఆ పరిస్థితుల్లోనే అతడు పుట్టి పెరిగిన వూళ్ళోని గుమస్తాగిరీకి రాజీనామా యిచ్చి, మద్రాసులో బ్యాంకు గుమస్తాగిరీ సంపాయించాడు.

మద్రాసు జీవితం అతడికి బాధాకరంగానే తోచింది. అంత మహాపట్టణంలో తనో అనామక

వ్యక్తిగా బతకవలసి రావడం, నిజంగా నిస్పృహనే కలిగించింది. తన పంచకట్టూ, లాల్చీ, వుంగ రాల జుట్టూ, ఆ మహాపట్టణంలో ఎవరికీ ప్రత్యేకంగాగాని, వింతగాగాని కనబడినట్టే లేదు. అదే తన వూళ్ళో, రోజూ ఎన్ని మేలిముసుగుల్ని, కిటికీ రెక్కల్ని, బండ్ల తెరల్ని తొలిగింప చేసేదో అతడికి తెలుసు!

బ్యాంకులో తనతోపాటు పనిచేసే ముగ్గురు టైపిస్టు అమ్మాయిలలో ఒక్కతే తనను పలకరించ డమంటూ జరగలేదు గదా, ఆఖరికి కన్నెత్తి కూడా చూసినట్టు లేదు. రోజూ తనతో పాటు ట్రాం ఎక్కి ప్యారీస్‌లో దిగే ఆ పెద్దకళ్ల ఎర్ర పిల్లగాని, పాండీ బజారులో తన రూము ఎదురుగా ఒంటరి జీవితం గడుపుతున్న మళయాళీ అమ్మాయిగాని, బీచీలో ప్రతి ఆదివారమూ కనబడే ఆ తెలుగు పిల్లల మందలో, ఏ ఒక్క పిల్లగాని తనను చూసినట్టే లేదు. అందరూ ప్యాంట్స్‌లో జార్చబడ్డ చొక్కాల వంకా, గొంతు కింద వేలాడే గుడ్డపీలికల వంకా, స్నో మీద పౌడరు కింద కనబడే మొహాల వంకా చూస్తున్నట్టే తోచేది - మెచ్చుకున్నట్టే కనబడేది.

రంగారావుకు తన అందం మీదా, ఆకర్షణ శక్తి మీదా అనుమానం మీద అనుమానం కలగి, అది నిరాశగా, తను ఆజన్మ బ్రహ్మచారిగా కాలం వెళ్ళబోయవలసిందే అన్న నిస్పృహా అక్కడే, ఆ మద్రాసులోనే బలంగా కలిగి, పెరిగి పెద్దదై వూడలు దించేసుకుంది. స్త్రీల మీద నిరాదరణా, జీవితం అంటే అసహ్యం, అతణ్ని క్రమ క్రమంగా, వశపరచుకుని లొంగదీసుకున్నయ్.

గడ్డం పెరగడాన్ని తోటి గుమాస్తాలూ, గుడ్డలు మాయడాన్ని పక్కింటి చాకలీ, రోడ్డుకు ఓ పక్కగా నడవవలసిన అవసరాన్ని రిక్షావాళ్లూ, పోలీసులూ ఆ దశలోనే అతడికి చెప్పి, మందలించ వలసిన అవసరం కలిగింది.

ప్రేమనేది ఓ రకమైన పిచ్చనీ, యీ ప్రపంచం ఓ కలనీ, జీవితపు ఆద్యంతాలు ఓ గుప్పెడు మట్టీ, ఓ చేరెడు బూడిదా అన్న భావాలూ, వాటికి రూపాలు కూడా, రంగారావులో క్రమక్రమంగా నిలదొక్కుకుని, గూడుకట్టుకున్నయ్.

ఇంగ్లీషులో వున్న ప్రవేశంతో, తెలుగు ప్రబంధాలు చదివిన జ్ఞానంతో అతడు ఓ కొత్త ధోరణిలో కవిత్వం చెప్ప నారంభించాడు - కథలు రాయ మొదలు పెట్టాడు.

ఇంగ్లీషులో యిద్దరు ముగ్గురు మిధ్యా కవుల భావాలని, పోతులూరి వీరబ్రహ్మంగారి కాల జ్ఞానంతో, వేదాంతంతో కలిపి గుండగా కొట్టి, ఓ నూతన పటిమతో విశిష్టతతో రంగారావు కవిత్వం రాసేవాడు. అతడు కథల్లో - అంధకారంలో అనంత జన ప్రవాహం కదులుతూండటం, మొదటి గొంతు, రెండో గొంతు, మూడో గొంతు మాట్లాడడం - గొంతులు గొంతులే గొంతులు పిసుక్కుని గోతుల్లో పడిపోవడం - అంతా సూచనప్రాయంగా, కళాత్మకంగా రాసేవాడు.

పద్మనాభం ఓ ఆదివారం రోజున గది తలుపు నెట్టుకుని లోపల ప్రవేశించే వరకు, రంగారావు జీవితం యిదే రకంగా నడిచింది - కవిత్వం, కథలూ కూడా అదే ధోరణిలో నడిచినై.

పద్మనాభాన్ని చూడగానే, రంగారావులో ఓ నూతన జీవి, తను నిరాశతో నిస్పృహతో గొంతు నులిమి పారేయదలచుకున్న తనలోని జవసత్వాలు వున్న మానవుడు, యిట్టే బయట పడ్డాడు.

ఎంతో వుత్సాహంగా రోజల్లా మిత్రులు మాట్లాడుకున్నారు. ముప్పైనాలుగేళ్ళ వయసులో తను ప్రేమించి వివాహం చేసుకోబోతున్నానని పద్మనాభం చెప్పినప్పుడు, రంగారావులో నిజంగానే ఆశా, జీవితంలోని అందం ఆనందం కదిలినట్టయింది.

"నువ్వు రాసేవి చదువుతూనే వున్నాను. జీవితం మీద అంత నిరాశ పనికిరాదు" - పద్మనాభం యీ మాటల్ని సూటిగా అన్నప్పుడు, రంగారావు జవాబు కోసం తడువుకున్నాడు.

"జీవితం మీద అంత నిరాశ నీకే ఎందుక్కలుగుతోందో నా కర్థం కావడం లేదు" - మళ్ళీ పద్మనాభమే ప్రశ్నించాడు.

రంగారావు మాటలు మింగుతూనే జవాబిచ్చాడు.

"నిరాశకే మరో పేరు జీవితం. గుప్పెడు మట్టి! చేరెడు బూడిద"

పద్మనాభం అతడి వంక ఆశ్చర్యంగా చూశాడు. సరిగా యివే మాటలు, ఓ బైరాగి నోటి నుంచి లోగడ విన్నట్టు అతడికి గుర్తొచ్చింది.

"కందిమల్లయ పల్లె - పేరయ్యగారి పేర్లు నీకు తెలుసు ననుకుంటాను. ఆ పేర్లు మన ప్రాంతాల్లో వినే వుంటావ్. మరి మధ్యమధ్య నీ కవిత్వంలో యింగ్లీషు మాటలూ, ఆ కవుల పేర్లూ ఎందుకు వుపయోగిస్తావో నా కర్థం కావడం లేదు"

రంగారావు ఓ నిమిషం ఆలోచిస్తూ వుండిపోయాడు. తరవాత గొంతు సవరించుకుంటూ -

"మన తెలుగులోనే కాదు, యింగ్లీషులో కూడా జీవితమంటే విషాదమని చెప్పిన వాళ్లు వున్నారు. గొప్ప కవులూ, తత్వవేత్తలూ,..."

పద్మనాభం ముఖం చిట్లించడం చూసి రంగారావు అంతటితో ఆగిపోయాడు.

"ఆపాటి దానికి మనం ఇంగ్లీషు చదవనవసరం లేదు. వీరబ్రహ్మంగారినీ, సిద్దయ్యగారినీ క్షుణ్ణంగా చదివితే సరిపోతుంది. యింతకీ - నీకు జీవితం మీద - యింత నిరాశ ఎందుకు కలిగింది?"

రంగారావు జవాబు చెప్పలేదు.

పద్మనాభం ఐదారు నిమిషాలు అతడి మొహం వంకా, గదిలోని అన్ని వస్తువుల వంకా చూస్తూ వుండిపోయాడు. బాగా చీకటి పడిన తరువాత, మళ్ళీ కనబడతానని చెప్పి, వెళ్ళేముందు, "నీకు నా కాబోయే భార్య స్నేహితురాలితో పరిచయం చేస్తాను. రేపు సాయంత్రం ఆరు గంటలకు తయారుగా వుండు" - అన్నప్పుడు, రంగారావులో చిన్న ఆశ మిణుగురు పురుగులా మెరిసి నట్టయింది.

పుష్పతో రంగారావు పరిచయం, బాగా స్నేహంగా, ఆత్మీయంగా మారడానికి ఎక్కువ కాలం పట్టలేదు.

'యీయన నా బాల్య స్నేహితుడు రంగారావు' అని పుష్పకు పరిచయం చేయడంతో తన పని పూర్తయినట్టుగా పద్మనాభం పక్కకు తప్పుకున్నాడు.

పుష్పతో పరిచయం అయిన రాత్రి రంగారావుకు ఏమాత్రం నిదర పట్టలేదు. తన కోసమే

ఎదురు చూస్తూ ఇరవై నిండు సంవత్సరాలు ఆమె అవివాహితగా వుండిపోయిందన్నట్టు అతడికి తోచింది. తను ఆశించిన ఆదర్శ స్త్రీ లక్షణాలన్నీ ఆమెలో అతడికి కనబడినై. కాని, అతడు నిరాశతో, కావాలని అలవాటు చేసుకున్న వైరాగ్య లక్షణాలూ, నిస్పృహ నిస్సార గుణాలూ, మొదట్లో, అతడి ఆశల మీదా, లోలోన ప్రజ్వరిల్లుతోన్న ప్రేమోద్వేగాల మీదా, బరువుగా కూర్చుని అణగదొక్కేందుకు ప్రయత్నించినై.

కాలం దొర్లిపోతోంది. ప్రతిరోజూ, సాయంత్రం ఆఫీసు పని కాగానే రంగారావు ఆమె యింటికి చేరేవాడు. అడ్డుపడేందుకూ, మాటల మధ్యలో కల్పించుకునేందుకూ, ఆమె యింట్లో మరెవరూ లేరు. పుష్ప ఒంటరి జీవి. హాయిగా బతికేందుకు అవసరమైన ఆస్తిపాస్తులు కూడా వున్నయ్.

పరిచయం అయిన కొత్తలో వున్న వుత్సాహమూ, వుద్వేగమూ క్రమంగా నశిస్తున్నట్టూ లేక ఒక స్థాయికి పోయి స్థాణువులా ఎదుగుబొదుగులు లేకుండా నిలబడి పోయినట్టూ అతడికి తోచింది. మరో మెట్టు పైకి ఎక్కేందుకూ, తన హృదయంలోని కాంక్షనీ, ప్రేమనీ బయట పెట్టేందుకూ, రంగారావు, తరుణం కోసం, సరైన సమయం కాలం కోసం ఎంతో ప్రయత్నించాడు – ఎదురు చూశాడు.

పుష్ప కట్టుకున్న చీరని పొగడడంతో, ఆమె మెడలో వేసుకున్న గొలుసును మెచ్చుకోవడంతో, తీయించుకున్న ఫోటోలోని అందాన్నీ, సౌకుమార్యాన్నీ, శోభనీ తనివితీరా చూసి చూసి 'ఆహాఁ' – అనడంతోనే కాలం గడుస్తోంది. ఆ పైమెట్టు, ఆ అసలు సంగతిని అడగడమెప్పుడు? యిది రంగారావుకు సమస్యగానే వుండిపోయింది. అతని జీవితంలో నిద్రలేని రాత్రులు ఎక్కువయినై కనుక, కలల్లో కూడా యీ సమస్య తీరే అవకాశం చిక్కలేదు.

ఆ రోజు సాయంకాలం మామూలు కన్న ఓ గంట ముందుగానే ఆఫీసు నుంచి బయలుదేరాడు. కొంత చొరవ పురుషుడు చూపించాలనీ, ప్రేమదాహంతో గొంతు ఎండి చస్తున్నా, ప్రేమాగ్నిలో మాడి మసైపోతున్నా స్త్రీ మాత్రం తనకుతానై పురుషుడితో ముందుగా ఆ విషయంలో చొరవ తీసుకుని బయట పడదనీ అతడికి, అనుభవం మీద నమ్మకం ఏర్పడి పోయింది.

రంగారావు వెళ్ళేప్పటికి పుష్ప కిటికీ దగ్గిర టేబిల్ ముందు కుర్చీలో కూర్చొని ఏదో పత్రిక చదువుతోంది. టేబిల్ మీద మరికొన్ని పుస్తకాలూ, పత్రికలూ పడివున్నయ్.

పుష్ప రోజూ కన్న మరికొంత వుత్సాహంగానే అతన్ని ఆహ్వానించింది.

రంగారావు మామూలు కన్న మరికొంత వుత్సాహంతోనే ఎదురుగా కూర్చున్నాడు. తను ఆమెను ప్రేమిస్తున్నట్టు, కనబడగానే చెప్పేయాలనుకున్న అతడి మొదటి నిర్ణయం. ఆమెను చూడగానే, కొంత సందర్భం కోసం, సంభాషణ సాగింతర్వాత చెపితే బావుంటుందన్న నిర్ణయంగా మారింది.

చేతిలోని పత్రికని టేబిల్ మీద పెడుతూ, పుష్పే సంభాషణ ప్రారంభించింది.

"పద్మనాభంగారు విచిత్రమైన మనిషి. ఆయన స్నేహితుల్లో కొందరు మరీ విచిత్రమైనవాళ్ళూ! రంగారావు అన్న, ఆయనగారి స్నేహితుణ్ని మీరెరుగుదురా?"

రంగారావు తల మీద పిడుగు పడిన వాడిలా అదిరిపోయాడు. అతడికి ఆమె ప్రశ్న ఐస్‌లా మనస్సునీ, శరీరాన్ని తాకి, అన్ని అవయవాల్నీ తిమ్మిరెక్కించింది. జవాబు కోసం తడుముకున్నాడు.

"బహుశా మీరు ఎరిగి వుండరు. మొదట్లో పేరును బట్టి మీరేమో అనుకున్నాను. కాని మీరు కథలూ, కవిత్వం రాస్తారని పద్మనాభంగారు చెప్పలేదు. మీరు ఎప్పుడూ అనలేదు కనక ఆ సంశయం పోయింది. చూడండి యీ కవిత్వం! కళ్యాణి, భర్త స్నేహితుడు రాసిన కవిత్వం, కథలూ అంటూ యివ్వాళ వుదయమే యీ పత్రికలు యిచ్చింది"

పుష్ప నవ్వుతూ, ఓ రెండు పాత పత్రికల్ని రంగారావు ముందుకు నెట్టింది.

అతడు టేబిల్ మధ్య దృష్టి నిలిపి కదలా మెదలక వుండిపోయాడు. పరిస్థితి అగమ్యగోచరంగా తోచింది, పుష్ప ఆ కవిత్వాన్ని దూషిస్తున్నట్టా? భూషిస్తున్నట్టా? అతడు పరిస్థితిని అర్థం చేసుకునేందుకు సర్వేంద్రియాల్నీ కేంద్రీకరించాడు.

మళ్లీ పుష్పే మాట్టాడింది.

"యిలాంటి వాళ్ళు పుట్టడమే ఓ వింత. తరువాత, తింటూ, తిరుగుతూ, పెరుగుతూ, అంతా వట్టిది, సర్వం కుళ్ళు, జీవితం దుమ్ము, కల్మశం అంటూ అందులోనే బతకడం మరీ వింత. యిలాంటి వాళ్లు ఏ స్త్రీని ప్రేమించలేరు - స్త్రీత్వం కోల్పొని ఏ స్త్రీ వీళ్ళని ప్రేమించలేదు. చదవండి! యిక్కడ! యిది!"

పుష్ప పత్రిక తెరిచి ఓ పేజీ చూపుతూ రంగారావు ముందుకు నెట్టింది.

అతడు వణుకుతున్న వేళ్ళతో చీకట్లు నింపుకుంటున్న కళ్లతో పత్రికని అందుకున్నాడు.

అక్కడ స్పష్టంగా తన పేరూ, గేయం - శీర్షిక - 'బతుకు-బూడిద!'

రంగారావు ఏమీ మాట్టాడలేదు. మాట్టాడాలని ప్రయత్నం కూడా చేయలేదు. మూగగా అనేక భావాలు అతడి హృదయంలో కదుల్లాడినై - బాధకలిగించినై. పుష్ప మీద తను పెట్టుకున్న ఆశలు నిరాశలైనందుకో, పుష్పతో పరిచయం అయిన తరవాత, తను కవిత్వం, కథలూ రాయనందుకో ఎవరూ చెప్పలేరు - అతడికీ తెలీదు.

"మీరు యివ్వాళ వుత్సాహంగా లేరు. కాఫీ తెస్తాను వుండండి" - పుష్ప యిలా అంటూ కుర్చీలో నుంచి లేచినప్పుడు, రంగారావు ధైర్యాన్ని కూడ కట్టుకొని ఆమె కళ్లల్లోకి శూన్యంగా చూశాడు. ఆమె కళ్లల్లో ఓ వింత వెలుగూ, జీవితాన్నీ, భవిష్యత్తునూ నిర్ణయించుకోబోతున్న క్షణాల్లోని గంభీరతా, ప్రేమా, జాలీ కదిలినట్టూ, తన నుంచి ప్రోత్సాహం కోసం, ఓ చిన్న సూచన కోసం ఎదురు చూస్తున్నట్టూ తోచింది - స్పష్టంగా కనబడింది.

పుష్ప కాఫీ తెచ్చేందుకు వంట గదిలోకి వెళ్లింది.

రంగారావు చీకటి కప్పుకుంటున్న కళ్లతో తలుపు తెరిచి రోడ్డు మీదికి వచ్చాడు.

చీకట్లో నడుస్తున్నాడు - మరీ చీకట్లోకే నడుస్తున్నాడు!

❋

(అభిసారిక మాసపత్రిక : జూన్, 1950)